# - రాగమయి -

శ్రీదేవి

'అక్కయ్య బావ సాయంత్రం రైలుకి వెళ్తారట.'

"అలాగా." నిర్లిప్తంగా అనేసి గుప్పెడు మౌనాన్ని బండెడు అజ్ఞాన్ని వెదజల్లాడు విశ్వం.

పార్వతి సందేహాన్ని సాగనంపి సమాలోచనకు ఆయత్తమవుతూ అడిగింది.

" నానిగాణ్ని అక్కయ్యతో పంపటం సంగతేం చేశారు ?"

'మధ్యలో బడిమాన్పించితే చదువు పాడవుతుంది పార్వతీ!

'వాళ్ళ వూళ్లో స్కూళ్ళు లేవాయేం ?'

" ఉన్నాయి గదాఅని పిల్లల్ని అలాపరాయి వాళ్ళకు పంపటమేనా... "

" మీరు మరీనండి. అక్కయ్య పరాయిదెలా అవుతుందండి. నా పేగులో పేగు, రక్తంలో రక్తమూను. చూస్తున్నారుగా ఈ పదిరోజుల బట్టి నానిగాడు అక్కయ్య దగ్గర ఎంత అలవాటు పడిపోయాడో."

'మమతలు మాయమయి మాలిన్యాలు చేరుకుంటున్న రోజులివి పార్వతీ, పరాయి కన్నమ్మ బిడ్డని పదినిముషాలు ముద్దులాడ గలరుగాని రోజుల తరబడి నెత్తికెక్కించుకోలేరు.'

కుర్చీని విశ్వందాపులకు లాక్కుని రహస్యంగా చెప్పింది పార్వతి. " నానిగాడు వాళ్ళలో కలిసిపోతే దత్తుతీసుకుందా మనుకుంటున్నారట."

'ఈ ఆలోచన మీ అందరిలోనూ ఉద్భవించి పెరిగి పెద్దదవుతోందని నే నెప్పుడో పసిగట్టాను. పిల్లాణ్ణి విడిచి నువ్వుండ గలవా ?'

ఉంటాను, మరేం చేస్తాను. వాడి బాగుకోరి ఏదయినా భరిస్తాను ?"

"వాడి బాగుకోరే పెంపకాని కిస్తున్నావా ?"

" కాకమరేమిటండి. సుక్షేత్రమైన భూమి, పదివేలు చేసేయిల్లూ, పాడీపంటా అన్నీ వున్నాయి. అక్కయ్య వాణ్ణి పువ్వుల్లో పెట్టిపెంచుతుంది.

" ఇదంతా డబ్బుమీద అపేక్ష "

'డబ్బును ఉపేక్షించే వాళ్లెవరయినా వున్నారా?'

" అందుకని పిల్లాణ్ణి డబ్బుకు అమ్ముకుంటావా?"

" మీరుమరీ చోద్యంగా మాట్లాడతారండి. మీ అమ్మా నాన్నా మిమ్మల్ని పెంపకానికివ్వలా ? అంత మాత్రం చేత మిమ్మల్ని వాళ్ళు అమ్మినట్టేనా ? "

విశ్వం వాలు కుర్చీలో చేరగిలపడి కందిరీగల్లా ముసురుకుంటున్న ఆలోచనల్తో అన్నాడు " సందర్భం వచ్చింది కనుక చెప్తున్నాను. పార్వతీ. మా నాన్న నన్ను డబ్బుచూసే పెంపకాని కిచ్చాడు, మా అమ్మనుంచి వేరుచేసి ఈ పట్టుపరుపుల బంగళాలోనికి విసిరేశాడు. ఒక్క విషయం పార్వతీ! మానవుడి మనుగడకి ధనమొక్కటే ముఖ్యంగాదు. ప్రేమ, ఆదరణలను గాని శాంతి సౌఖ్యాలనుగాని అంగడిలో కొనలేం. ఇంక ఈ విషయం నాముందర ఎత్తద్దు. " పార్వతి మౌనాన్ని చేదు మాత్రలామింగింది.

డ్రాయరులో పదిలంగా దాచిన ఉత్తరాల కట్టను తీసి ఆమెకిస్తూ " చదువు. ఇవి చదివిన తరువాత కూడా నీ అభిప్రాయం మారకుంటే ఆలోచిద్దాం

అన్నాడు. " పడతలు పడ్డ మొదటి ఉత్తరాన్ని తీసింది పార్వతి.

' విస్సూ.

ఈ ఉత్తరాన్ని చదివి అర్థం చేసుకునే వయస్సు నీకు లేదు ! అయినా ఆపుకోలేని ఆవేదనతో వ్రాస్తున్నాను. నువ్వొక మనిషిగా తయారయిన నాడు తిరిగి చదివి నన్ను, నా బాధను గ్రాహ్యం చేసుకోవాలి !

మాతృమమకారం ముందు వెలకట్టలేని రత్నాలను రాశిగాపోసినా తీసికట్టు అనిపించు కుంటుంది. నిస్వార్థత, ఆర్ద్రత కలిసిన ఆమె హృదయం వెన్న కన్న మెత్తనిది. చక్కెరకన్న తియ్యనిదీను. ఓర్పు నేర్పు ఆమెకు ఉగ్గుపాలలో కరగించి పోసిన విశేషాలు. వయస్సులో పొద్దుటారిపోతున్నా, ప్రపంచమే అలక్ష్యం చేసినా త్యాగనిరతితో మహాఅపేక్షతో పసిడి కందుల్ని కంటికి రెప్పలాకాపాడి ఉజ్వల భవిష్యత్తును, ఉన్నత విలువలను కాంక్షిస్తుంది సేవ ఆమెకు పెట్టని గుణము. తన్ను విస్మరించి తను కన్న సంతతిలో తనమూర్తిని చూసుకుని తృప్తిపడుతుంది. తన కోరికల్ని జయించి పిల్లల వాంఛలను ఇతోధికం చేసి వాటిని తీర్చాలని ప్రయాస పడుతుంది. అయినా ఆమె స్త్రీ ! అందుకే అసూయ. అత్యాశ, నిస్సహాయతలను జయించ లేక పోయింది. కామ క్రోధ మద మాత్సర్యాలను విసర్జించగల మహాపురుషుణ్ణి ఆశ్రయించింది. కాని మాయలోపుట్టి పెరిగి నశించే మానవుడు ఆమెనూ అధః పాతాళానికి తీసుకెళ్లాడు అదే ఆనందంగా స్వీకరించి ఆలంబనాన్ని అట్టేపెట్టుకున్నది; ఎందుకంటే వగచి ప్రయోజనం లేదని ఆమెకూ తెలుసు. అతీత శక్తి ఆదేశించిన మార్గం అక్రమమైనా సక్రమమైనా. సుగమమైనా దుర్గమమైనా అనుసరించక తప్పదనీ. కర్మానుసారం ఎవరు చేసు కున్నది వారను భవించాలనీ ఆమెకు తెల్సు."

" నేను ఈ జాతికి చెందిన స్త్రీనే. ఈ సుగుణాలన్నీ నాకు నేను ఆపాదించు కోలేపోయినా, చలన రహితమైన రాతిని మాత్రం కాను. కష్ట, సుఖాలకు చలించే మామూలు ప్రాణిని. పరే !

హఠాత్తుగా ఒకనాడు మీనాన్న వచ్చి దుర్గా! మూడో వాణ్ణి జానకి రామయ్య గారికి పెంపకానికి ఇస్తానని మాటిచ్చానే అన్నారు. నీ కప్పటికి మూడోమాసం జరుగుతోంది. సన్నగా చిన్నగా తెల్లగా పాలిపోయినట్టుండే వాడివి, ఉయ్యాల్లో పడుకుని నిద్రపోతున్న నిన్ను తీసిగుండెలకు హత్తుకున్నాను. అంతే కాని నన్ను సంప్రతించ కుండా మాట ఎందుకిచ్చారని మీ నాన్నను నిలవెయ్యలేక పోయాను. జానకి రామయ్యగారి తరవాత నీకెంత ఆస్తి వస్తుందో నువ్వెంత ఘరానా కుటుంబానికెడుతున్నావో నీ భవిష్యత్తెంత ధగధగ్గాయ మానంగా వుంటుందో వర్ణించి చెప్పున్నారు. తతిమ్మా నీ అన్నలిద్దరూ ఆసక్తిగా వింటున్నారు, నా కెందుకో భోరుమని ఏడవాలని పించింది. కాని ఏదోఅశక్తత నా గొంతును అదిమిపెట్టింది. కళ్ళలోకి నీళ్ళేరాలేదు. అలానిశ్చలంగా కిరసనాయిలు దీపాన్ని చూస్తూ కూర్చుండి పోయాను. కాలం అవిరామంగా పరిగెడుతూనే వున్నది. "

" దుర్గా ! దత్తతకుముహూర్తం నిర్ణయించారే " అన్నారు మర్నాడు మీ నాన్నగారు. ఈ అమాయక పశు మేకను బలియిచ్చే రోజుగాబోల్సు అనుకున్నాను ఒళ్ళోవున్న నిన్ను చూసి అరఘడియ కూడా తడి ఆరని కళ్ళల్లో, తప్తహృదయాన్ని దాచు కోవాలని వ్యర్థ ప్రయత్నం చేసేదాన్ని. మానసిక రుగ్మతను శారీరక రుగ్మతగా మార్చుకుని అయిన వాళ్ళను కాని వాళ్ళను తప్పుకు తిరిగేదాన్ని. ఉధృతంగ ఉప్పొంగి వచ్చే భావోద్రేకాన్ని అణచుకో లేక సతమత మయ్యేదాన్ని. అయినా మీ నాన్న నన్నూ నా బాధనూ అలక్ష్యం చేశారు. గొంతెత్తి ఎదురు చెప్పే సాహసం నాకులేదు. అలా అని లాలించి నా ఉద్దేశం తెల్సుకునే పాటి నేర్పు ఓర్పు మీ నాన్నకు లేదు. ఆదివారిహయాం, నేనువారిహయాంలో బ్రతికే భార్యను. అంతే.

" తోటి స్త్రీకదా నన్ను ఓదార్చక పోతుందా అన్నట్టు కామేశ్వరమ్మ గారి వైపుఎంతో ఆశగా చూశాను. దబ్బుపారేసి పిల్లాణ్ణిపక్కించు కున్నాను వీళ్ళతో నాకేమిటి పని అన్నట్టు ధీమాగా వెళ్ళిపో

యింది ఆవిడ, నాకళ్ళు నిండు కొచ్చాయి. ఆమె అలక్ష్యానికి కాదు. నాఅశక్తతకు భగవంతుడు బిడ్డల్నిచ్చి డబ్బు ఇవ్వనందుకు. ఒకింత సేపు నా దురదృష్టాన్ని నిందించు కున్నాను. "

" రత్నాల లాంటి ఇద్దరు పిల్లలుండగా మూడో వాణ్ణి తలుచుకుని కుములిపోవట మెందుకు ? " అది మీ నాన్నగారు విసిరే విసురు.

" వీళ్ళున్నారు వాడులేడు " అనుకున్నాను మిగతా ఇద్దర్నీ దగ్గరకు తీసుకుంటూ ఉన్నదాంతో తృప్తిపడటమనేదే స్త్రీ తత్వానికి విరుద్ధం. అది ఆమె హృదయాకాశంలో వినబడని మాట. తనది కాని వస్తువు భూతద్దాలలో కనిపించి వెక్కిరిస్తుంది. ఊరిస్తుంది. అయినా కాయతీగకు బరువా ? పువ్వు పూచిం దగ్గరనుంచి కాయ ఎప్పుడవుతుందా అని వెయ్యి కళ్ళతో ఎదురుచూసే తీగ పిందె పడంగానే విసుక్కుంటుందా ? కాయల బరువుతో క్రుంగిపోయి భూమికి అంటుకునే పాదు పొందే ఆనందం మరిదేనికయినావుందా? ఏదో విశ్వా, పండగకి జానకిరామయ్యగారూవాళ్లూ పంపనన్నారన్న దుఃఖంతో ఇదంతా వ్రాస్తున్నాను. వాళ్ళమీదనాకేం కోపంలేదు, నాయనా

" కామేశ్వరమ్మగారు నిన్నుబాగా చూసుకుంటుందిటగా ? కావాలని తీసుకున్న వాళ్ళు చూడకేం చేస్తార్లేగాని, నాకునువ్వు లేనిలోటు లోటే నాయనా! ఎప్పుడయినా కళ్ళతో చూడగలుగుతానో లేదో. పన్నెండేళ్ళ బట్టి దగ్గరకు తీసుకుని బువ్వతినిపించాలన్న ఈఆదుర్దాని ఎప్పుడు. తీరుస్తావో! ఏమోరా నీకు నేను గుర్తున్నానో లేనో, నీ చేతుల్తో నేను గుర్తున్నాననిఒక్కముక్క రాయిబాబూ ! మరోపుష్కరం బ్రతుకుతాను విస్సూ. "

" పార్వతీ, నువ్వు మా అమ్మలా ఆలోచించి తల పగుల గొట్టుకోకపోవచ్చు. నానిగాణ్ణి దత్తతకివ్వాలంటే నా కెందుకో మనసొప్పటం లేదు " అన్నాడు విశ్వం ఉత్తరం పూర్తి చేసిన పార్వతిని చూస్తూ.

పార్వతి మౌనంగా నిట్టూర్చింది.

" నాకు పధ్నాలుగోయేట మశూచి పోసింది. అప్పుడు వ్రాసింది అమ్మ ఇది చదువు అని రెండో వుత్తరాన్ని అందించాడు.

' విశ్వ, తండ్రీ !

బ్రతికి బయట పడ్డావా, బాబూ ! ఇలాజబ్బుగా వున్నాను అని కాకి చేత కబురెట్టితేవచ్చి నీదగ్గరవాలే దాన్నిగా నాయనా ? చీమూ నెత్తురూ అని అసహ్యించు కోకుండా చాకిరీ చేసేదాన్నే ! అంటువ్యాధి అనిగొడ్లపాకలో పడకో పెట్టారా నిన్ను ? అదేం తల్లిరా మారుటి తల్లి. ? నీళ్ళిచ్చేదిక్కయినా లేక అర్ధరాత్రులు ఎలా అలమటించావో తలుచు కుంటే నా గుండె నీరై పోతోందిరా, ఎందుకూ పనికిరాని ఈ తల్లి బ్రతికిమాత్ర ఏం ప్రయోజనం ? ఎవరికీ అక్కరకురాని ఈ శరీర మెందుకురా? అన్నలిద్దరికీ ఎప్పుడూ నిన్నే తల్చుకుంటానని నామీద కోపం కర్తవ్యతా విమూఢురాల్నవుతున్నానని మీనాన్నకు అసహ్యం. ఈ వాతావరణం నన్నెందుకూ కొరగానిదానిలా చేస్తోందిరా? ఒక్కమాటు నిన్ను చూడాలని ప్రాణం తల్లడిల్లిపోతుంది. పధ్నాలుగేళ్ళు ఓపికపట్టాను, ఇంక తాళలేను నాయనా? జానకిరామయ్యగారు మీనాన్న పోట్లాడుకుంటే మధ్యమనకేంరా? నేను తల్లిని నీవు బిడ్డవీను, మన మధ్య బంధాన్ని తెంచటానికి వీళ్ళకెవరిచ్చారు అధికారం, పథ్యం తిన్నావుగా శిధిలావస్తలోవున్న ఈ తల్లిని ఒక్కమాటు చూసిపోగూడదూ" పార్వతి ఉత్తరం చదవటం ఆపి ఆదుర్దాగా అడిగింది. "మీరు వెళ్ళారా?" "లేదు పార్వతీ, జానకిరామయ్య గారు కామేశ్వరమ్మ గారు నన్ను బంగారు ఉచ్చుల్లోకట్టి పడేశారు. అడుగు కదిపితే ఆ అడుగు భూమి నాకు దక్కదన్నారు. అలాఅని వాళ్ళు నన్ను యమయాతనలు పెట్టలేదు. అడిగిన వస్తువల్లా కొనిచ్చారు, కోరిన కోరికల్లా తీర్చారు. కాని అందులో ఉండవలసినంత ఆప్యాయత గాని ఆదరణగాని వుండేది కాదు. అన్నంపెట్టి తినమని అమ్మను తిడుతూ కూర్చునేది కామేశ్వరమ్మగారు, కారులో బడికి తీసుకెడుతూ మానాన్న లేమిని గురించి అసహ్యించుకునే

వారు జానకిరామయ్యగారు. మరొకరెవరయినా అయితే భోగభాగ్యాల్లోపడి ఇవన్నీ మర్చిపోయేవారేమో. కాని నాలో అసంతృప్తిని లేవదీసాయి. ఆ దంపతులంటే ఒక విధమైన ద్వేషాన్ని రగుల్కొల్పాయి. కామేశ్వరమ్మ గార్ని అమ్మా అని అభిమానంగా ఎప్పుడూ పిలవలేదు. పక్కమీదపడుకుని తలగడలో తలదూర్చుకుని మూడు నెలల వయస్సులో వుండగా చూసిన అమ్మని తల్చుకుని అమ్మా అని ఏడ్చేవాణ్ణి. ఉత్తరాల ద్వారా సుపరిచితమైన అమ్మను తల్చుకుని ఉప్పొంగి పోయేవాణ్ణి, అంతే."

పార్వతి సాలోచనగా వింటోంది.

"ప్రతి స్త్రీ ప్రేమించగలుగుతుంది పార్వతీ. కాని ఆ ప్రేమలోనే ఎంతో వైవిధ్యం వుంటుంది అమ్మ నాయందు వాత్సల్యాన్ని పెంచుకుందీ అంటే అది స్వార్థపూరితంకాదు. తను కన్నబిడ్డ తన రక్తం అన్న మమకారం మాత్రమే. మూడు నెలల పసిగుడ్డును మర్చిపోవటానికి మూడు క్షణాలు చాలదూ. ముప్పై సంవత్సరాలు ఆలమటించి తీరని కోరికతో నీ కడుపున పుట్టి నా బాధను తీర్చుకుంటాను. అంటూ ప్రాణాలు వదలాలా? కామేశ్వరమ్మ గారు నన్ను కొడుకులానే పెంచింది. అంటే తమతదనంతరం తమ ఆస్తికి వారసుణ్ణని తలకొరివిపెట్టే వాణ్ణని మాత్రమే ప్రేమించింది మన పారూ వున్నదంటే నాన్నని నాన్నగానే ప్రేమిస్తుంది. కొన్ని సమయాల్లో నన్ను తన బిడ్డగా గూడా భావించి జోలపాడుతుంది. చిచ్చికొడుతుంది, అది అచ్చు మా అమ్మే. ఇహ నువ్వున్నావంటే . . . ."

"వద్దు నా ప్రేమను మాత్రం నిర్వచించకండి" అన్నది భయంగా ఆందోళనతో

"సరే, ఆ మూడో ఉత్తరం చదువు."

'ఉహూ వద్దు. నాగుండె బరువెక్కి పోతోంది.'

"కాదు పార్వతి, అమ్మ ఉత్తరాల్లో జీవించటమంటే నా కెంతోసర్దా, చదువు ఫర్వాలేదు."

పార్వతి తప్పదన్నట్లు మరో ఉత్తరాన్ని విప్పింది.

"పరీక్ష పోయిందావిస్సూ. పోతుందని నేనను కోలేదురా. నీతెలివితేటలకి ఈ పెద్ద పరీక్ష తూనిక రాయి అనుకోలేదు. చదువులో అశ్రద్ధ ఎందుకు చేశావు బాబూ? నీకు అర్థంగాని విషయాలుంటే పెద్దల్నడిగి తెల్సుకోకపోయావా? విద్య వివేకాన్నిస్తుంది. వినయాన్నిస్తుంది. అటువంటి వరాన్ని కాలతన్నుకుంటావా? పోనీలే ఏంచేస్తాం? ఈమాటు చదువు కుందువుగాని. పడటం లేవటం అనేవి జీవితంలో చాలా చిన్న విషయాలు. పడ్డప్పుడు ఏడవటం లేచినప్పుడు వొళ్ళు దులుపుకుని నెత్తిమీద కళ్ళుపెట్టుకొని తిరగటం పనికిరావు, లేచినిలబడటానికి చాలిన ధైర్యాన్ని సమకూర్చుకోవాలి పడ్డప్పుడు లేచి నిలబడ్డ తరువాత మళ్ళీ పడకుండా జాగ్రత్తగా మసులుకోవాలి. చిన్న అపజయానికే ఇలా క్రుంగిపోవచ్చా? ధీరుల లక్షణంకాదది అంతేకాని చచ్చిపోవాలనుంది అని వ్రాయవచ్చునా? అటువంటిపాడు ఆలోచనెందుకొచ్చిందిరా? నీకేం వయసు ముంచుకుపోయిందా? లేక చదువురాని బడుద్ధాయివా? ఈమాటు చదివితే ఫస్టున పాసవుతావు. పట్టుదల కావాలేగాని."

"ముఖాన్న మచ్చలున్నంత మాత్రంలో హృదయ సౌదర్యం దెబ్బతినదు తండ్రీ కామేశ్వరమ్మగారు ఒక్క శరీర సౌదర్యాన్ని మాత్రమే ఎరిగున్నారు గనక నిన్ను చూసి అసహ్యించుకోవచ్చు. అందులో అసహజమేముంది. కాని ఒక్క విషయం గుర్తుపెట్టుకో. మనుష్యుల సౌందర్యాన్ని చూచి మూర్చపోవటం గాని, వాళ్ళ వ్యక్తిత్వాన్ని అంచనా వెయ్యటం గాని చెయ్యకు. మంచి గుణాలు మానవుడికొక విశిష్టత నిస్తాయి, ఆ విశిష్టతలో హృదయంగమమైన సౌదర్యంవుంది. అది అందరికీ సౌలభ్యంకాదు. కష్టపడి అలవర్చుకోవాలి."

"చూశావా పార్వతి. అమ్మ నన్ను జీవితాన్ని ఎదుర్కోవటానికి ఎలా తయారు చేసిందో. ఈ రోజు నేను తలెత్తుకు తిరగగల్గుతున్నానంటే అది ఆమె ప్రభావమే. పెళ్లిలో గూడా సౌదర్యరాశివైన నీవంక సూటిగా చూడగల్గానంటే అమ్మ ప్రభావమే

జానకిరామయ్య గారు చనిపోతూ పదహారేళ్ళన్నా నిండని నాభుజస్కంధాలమీదకు జీవితాన్ని త్రోసి వేసినా కామేశ్వరమ్మగారు మనోవ్యాధితో నామతి పోగొట్టుతున్నా పిచ్చివాణ్ణికాకుండా కర్తవ్యాన్ని నెర వేర్చుకొస్తున్నాను. సరే ఆ ఉత్తరాలిలాఇయ్యి. ప్రస్తుతానికొద్దాం, నానిగాణ్ణి ఇడిచిపెట్టి నువ్వుండగలవా?"

" ఉండ లేనే మొగాని అక్కయ్య విషయం ఆలోచించండి. పెళ్ళయి పదహారేళ్ళయింది .దానికిప్పుడు నలభై యేళ్ళు నిండాయి, బావకి దాదాపు ఏభైవుంటాయి, తరగనంత ఆస్తివుంది, గొడ్డూగోదా పాడి పంటా సమృద్ధిగా వున్నాయి. కాని ఇంట్లో కిలకిల లాడుతూతిరిగే మనుష్యులేలేరు. ఆయన ఆఫీసుకెళ్ళిన దగ్గర్నుంచి లింగులిటుకు మని అదొక్కతీ వుండాలి, వాళ్ళను ప్రేమించే వాళ్ళుగాని యోగక్షేమాలు అడిగే వాళ్లుగాని ఎవరూ లేరు, ఎవరయినా దగ్గరచేరారు అంటే అదిడబ్బు మీద ఆశతో తప్ప వాళ్ళమీద అపేక్షతో కాదు, ఎవర్ని చేరదీద్దామన్నా త్వరగా వారసులవ్వాలన్న దురాశతో ఏం పెట్టిచంపుతారో నన్న దుగ్ధేనాయే, "

' శోనీవాళ్ళద్దర్నీ మనింట్లోనే ఉండిపొమ్మను మనపిల్లల్ని చూసుకుంటూ, '

' ఇది మరీబాగుంది, ఇల్లుని సత్రం చేస్తారా ఏం? అసలు మీకు పిల్లాణ్ని ఇవ్వాలని లేదని చెప్పరాదు,'

' ఇంకాస్పష్టంగా చెప్పాలా. ? '

' మా అక్కయ్య ముందరే అన్నది. నీ భర్త ఆలోచన తెల్సుకోకుండా ముందరే మాటిస్తా వెందుకే అని '

" చాలా బాగా అన్నది, "

" అయితే మా అక్క నానిగాణ్ని మిమ్మల్ని కామేశ్వరమ్మ గారు చూచినట్టు చూస్తుందనా మీ భయం. "

' అలాచూడదని ఏక్కడుంది, '

" ప్రేమగా చూస్తుందని ఎందుకను కోకూడదు.,

' ఆమె ఆడది. అసూయ ముందుపుట్టిం తర్వాత ఆడదిపుడుతుంది గనుక. '

' అయితే నా మాటకు చీమతల కాయంత విలువయినా లేదన్న మాట. '

" ఉందిగనుకనే ఇంతవరకూ విన్నాను పార్వతి. నేను మొగాణ్ణి. శాసించే వాణ్ణి కనుక చెప్తున్నాను. నా పిల్లల్ని పెంపకాని కివ్వను. " అంటూ చరచరా గదిలోంచి బయట కెళ్ళిపోయారు.

కాలం చరచరా పరిగెడుతోంది. పార్వతి ముఖం కోపంతో జేగురు రంగు దాల్చింది. దుఃఖంతో కళ్లు నిండు కొచ్చాయి. ' నానిగాణ్ణి పిలిచి అడుగుతాను. వాడు వెడతానంటే ఆయన మటుక్కు కాదంటారా చూస్తాను' అన్నస్వయం నిర్ణయంతో ధృడనిశ్చయంతో నానిగాణ్ణి పిల్చేందుకు బయల్దేరింది.

గుమ్మంలోకి పోగానే నానిగాడు ఎక్కడినుంచో రొప్పుతూ పరుగెత్తుకుంటూ వస్తున్నాడు.

' అమ్మా. అమ్మా... షావుకారు నాగభూషణం గారి అబ్బాయి రాములేడూ ...వాడిని చదువు కొసం పట్టణం పంపించేస్తారుటె .. అక్కడ స్కూల్లోనే భోజనంట .. అక్కడే నిద్రపోతాడట.. మళ్ళీ ఏడాది దాకా ఇక్కడకు రాడుటే .. అక్కడ భయం కాదుటే., ' అన్నాడు.

" అల్లరి చేస్తే నిన్నూ ఆ స్కూలుకే పంపేస్తాము... " అంది పార్వతి. నానిగాడి కళ్ళల్లో భయంతో కలిసిన నీళ్ళు తిరిగాయి.

" అక్కడకు పంపద్దే అమ్మా..." నీదగ్గరే ఉంటాను . . . " అంటూ తల్లిని లతలాచుట్టుకు పోయాడు. ఆబంధంలోనుండి ఆమెవిడిపించు కోలేక పోయింది. పెంపుడు గురించి ఆమె అడుగుదామను కున్న ప్రశ్న ఆమె గొంతులోనేఉండి పోయింది.